క్లుప్తంగా

వినాయకుడి ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తంలో పాల్గొన్న ఆలయ కమిటీ

రాజమహేంద్రవరంసిటీ: స్థానిక నాళం భీమరాజు వీధిలోని ప్రాచీన దేవాలయం శ్రీసిద్ధి లక్ష్మీ వినాయకుడి చవితి నవరాత్ర ఉత్సవాలు వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు మాటూరి రంగారావు, శెట్టి జగదీష్ తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయినవిల్లి ఆలయం తరువాత ఈ ఆలయంలో మూషికం, నంది ఉంటాయని, అలాగే ధ్వజ స్తంభం కూడా అయినవిల్లి ఆలయం ఇక్కడ తప్పితే మరే ఆలయంలోనూ ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మద్ది నారాయణ రావు, నల్లం ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఆర్ఏసీసీ ఐసీయూ హాస్పిటల్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో అత్యాధునిక సౌకర్యాలతో ఆర్ఏసీసీ (రాజమండ్రి అడ్వాన్స్ క్రిటికల్ కేర్) ఐసీయూ హాస్పిటల్ అందుబాటులో ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమండ్రి దానవాయిపేటలోని యూనివర్సల్ హాస్పిటల్ 3 ఫ్లోర్‌లో ఆర్ఏసీసీ ఐసీయూ హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఆరుగురు డాక్టర్లు కలసి అంతర్జాతీయ ప్రమాణాలతో ఆర్ఏసీసీసి ఐసీయూ హాస్పిటల్‌ను ప్రారంభించారని, పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చి చౌదరి, డాక్టర్ తాటికొండ చంద్రమౌళి, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ గన్నీ భాస్కర్‌రావు, చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సన, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గురు ప్రసాద్, ఐఎంఏ కార్యదర్శి పిడుగు విజయభాస్కర్, డాక్టర్ అరుమిల్లి ప్రసాద్ చౌదరి, డాక్టర్ చక్రరావు పాల్గొన్నారు.

మెగాస్టార్ అభిమానుల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం రూరల్: మెగాస్టార్ పద్మ భూషణ్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని ఆయన అభిమానులు చేస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆనంకళా కేంద్రంలో రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి ఆధ్వర్యంలో మెగా హంగామా పేరుతో చిరంజీవి బర్త్‌డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మెగా అభిమానులకు జ్ఞాపికలను అందజేశారు. సిటీ, రాజానగరం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, సినీనటులు పృథ్వీరాజ్, భద్రం, రోహన్ సూర్య, రాష్ట్ర చిరంజీవి యువత కార్యదర్శి యేడిద శ్రీనివాస్, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

పోలవరం దస్త్రాల దహనంపై విచారణ జరపాలి

ధవళేశ్వరం: ప్రతిష్టాత్మక జాతీయ ప్రాజెక్ట్ అయిన పోలవరం ప్రాజెక్టు దస్త్రాల దహనంపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ తూర్పుగోదావరి ఏలూరు జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం శనివారం ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలన కార్యాలయంలో దస్త్రాలను గుట్టుగా కాల్చివేయడంపై వారి స్పందించి అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని వారు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరావు, కె.రాంబాబు నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	డబుల్‌ఇస్మార్ట్
సూర్యమినీ:	తంగలాన్
సూర్యప్యాలెస్	డబుల్‌ఇస్మార్ట్
స్వామి	మిస్టర్‌బచ్చన్
అశోక:	ఆయ్
శివజ్యోతి	మిస్టర్‌బచ్చన్
అనుశ్రీ	కమిటీకుర్రోళ్లు
రాజా	మిస్టర్‌బచ్చన్
రంభ	తంగలాన్
ఊర్వశి	డబుల్‌ఇస్మార్ట్
మేనక	స్త్రీ-2,వేదా
కుమారి	డబుల్‌ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్
అప్సర	మిస్టర్‌బచ్చన్
నామవరం	
విఎస్.మహల్	డబుల్‌ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	డబుల్‌ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్
కడియం	
వెంకటసూర్య	డబుల్‌ఇస్మార్ట్, మిస్టర్‌బచ్చన్

సోదర ప్రేమకు ప్రతీక రక్షాబంధన్

- మార్కెట్‌లో రకరకాల రాఖీల విక్రయం
- అన్నా తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసుకున్న తోబుట్టువులు
- నేడు రాఖీ పౌర్ణమి



సీటీఆర్ఐ: సోదర ప్రేమకు ప్రతీకగా రక్షాబంధన్‌ను జరుపుకొంటారు. శ్రావణ మాసంలో నిర్వహించుకునే అన్నాచెల్లెళ్ల ఆత్మీయ పండగ రాఖీ పౌర్ణమి. రాఖీ అనగా రక్షణ బంధం అని అర్థం. సోదరులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సోదరి ఆకాంక్షిస్తుంది. జీవితాంతం అండగా ఉంటామని సోదరులు సోదరికి హామీ ఇస్తారు. ఇదే ఈ పండగ ప్రాముఖ్యత. వయస్సు, కులమత భేదం లేకుండా జరుపుకునేది ఈ రాఖీ పండగ. ఈ సందర్భంగా నగరంలో రాఖీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. స్వీట్స్ షాపులు కూడా కళకళలాడుతున్నాయి. దేవీచౌక్, కంబాల చెరువు, గోకవరం బస్టాండ్ సెంటర్లు తదితర చోట్లలో కొత్త షాపులు వెలశాయి. రూ.5 నుంచి రూ.500 వరకూ కూడా రాఖీలు ఉన్నాయి. పువ్వులు, ముత్యాలు, పూసలతో తయారు చేసిన రాఖీలు, ట్రెండింగ్ రాఖీలు, సిల్వర్ రాఖీలు విభిన్నమైనవి మార్కెట్‌లో లభిస్తున్నాయి. అయితే గతేడాది కంటే విక్రయాలు అంతంతమాత్రంగా ఉన్నాయని విక్రయదారులు వాపోతున్నారు.

ఏ కష్టమొచ్చినా మా అన్నకు చెప్పకుంటా..



అన్న అంటే అమ్మలో సగం, నాన్నలో సగం. అందుకే నాకు ఏ కష్టం వచ్చినా, ఏ బాధ కలిగిన మా అన్నతో చెప్పకుంటాను. అన్నతో బాధలను పంచుకుంటే నా గుండె బరువు తగ్గుతుంది. ఎంత కష్టమైన మా అన్న నా కోసం, నా ఆనందం కోసం ఎప్పుడూ ముందుంటాడు. తల్లి, తండ్రులకు చెప్పుకోలేని విషయాలను మా అన్నతో పంచుకుంటాను. అందుకే ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా అన్న రాఖీ కడతాను.

– రాగ సంయుక్త

అనుబంధాలకు చిహ్నం



అనుబంధాల కొలువు, మమతానురాగాల నెలవుగా రాఖీ పౌర్ణమి నిలుస్తుంది. ఏటా మా అన్నకి రాఖీ కడతాను. ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితిల్లో ఉన్నా రాఖీ కట్టడం మాత్రం మానను. రాఖీ కట్టడం నాకు సెంటిమెంట్. నాకు ఎప్పుడు మా అన్నయ్య అండగా ఉంటాడని నా నమ్మకం.

– శీలం లతామురళీధర్

మొక్కలు నాటితేనే పర్యావరణానికి రక్షణ

- శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిణి అధ్యక్షుడు విజయస్వామి
- కోలమూరులో 750 మొక్కలు నాటిన వైనం



కోలమూరులో మొక్కలు నాటుతున్న శ్రీఅమ్మ ఒడి సేవా తరంగిణి సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని కాపాడవచ్చని శ్రీఅమ్మ ఒడి సేవా తరంగిని అధ్యక్షుడు విజయస్వామి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కోలమూరులో శ్రీఅమ్మ ఒడి సేవాతరంగిణి ఆధ్వర్యంలో 750 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయస్వామి మాట్లాడుతూ ఏబీవీపీలోని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ విభాగం, చేతనా ప్రకృతిసేవా సంస్థ సభ్యులు మొక్కలు నాటడంలో సహకారం అందించారన్నారు. కార్యదర్శి శివ స్వామి మాట్లాడుతూ చిరంజీవి, ఇషా ప్రథమ జన్మదినం సందర్భంగా నాయుడు గారి వంటిల్లు అధినేత రాకేష్, రమాదేవి దంపతులు ఈ కార్యక్రమానికి సహకరించారని తెలిపారు. జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అను శ్రీ సత్య నారాయణ చేతుల మీదుగా మొక్కలు నాటి,శ్రమదానం చేసిన సేవకులకు పుస్తక పంపిణీ చేశారని అన్నారు. చేతనా సంస్థ సభ్యులు సత్యం, సూర్య నారాయణ, సేవా తరంగిణి సభ్యులు కురుమళ్ళ నాగ వెంకట ధన లక్ష్మి, బూటి నాగమణి, ఐసెట్టి వీర వెంకట సత్యనారాయణ, లోకేష్, దొరబాబు, కోయ దుర్గా భవాని, సాయి భరద్వాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంఘాల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల వారు

రాజమహేంద్రవరం సిటీ: కోలకతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను ఉరి తీయాలని అదే సమయంలో మహిళల రక్షణకు ప్రత్యక చట్టాలు సిద్ధం చేయాలని జిల్లా వైద్య శాఖ (డీసీహెచ్ఎస్) పోష్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి అధ్యక్షతన గోకవరం బస్టాండ్ సెంటర్ అంబేడ్కర్ కాంస్యవిగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోలకత్తాలోని మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మహిళా వైద్యుల రక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, దళిత నాయకులు కప్పల వెలుగు, మోత నాగలక్ష్మి, ఖండవల్లి లక్ష్మి, ఎల్ఐసీ, వైద్య ఉద్యోగ సంఘాల నాయకులు, హ్యూమన్ రైట్స్ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు, ఎన్జీవో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిందువుల నిరసన ర్యాలీ

సీతానగరం: బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హిందువులపై దాడులకు నిరసనగా గ్రామంలోని హిందువులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ నుంచి సీతానగరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండలంలోని భజన బృందాలు, సత్సంగాలు, వివిధ ధార్మిక సంస్థలు పాల్గొని బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హిందు బంధువులు కర్రి శ్రీనివాస్, అద్దే మల్లేశ్వరరావు, ఖండవల్లి సాయి, వంగలపూడి ఆశ్రమ మాతాజీ, కొణపాల అభిలాష, గుల్లి సుబ్బయ్య, బుల్లి చిన్న, సుధాకర్ మాస్టారు, పువ్వాడ కృష్ణ, డేరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధుల దూరం

రంగంపేట: పరిశుభ్రతతో వ్యాధుల దూరమవుతాయని, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా తీసుకోవాలని గ్రామ సర్పంచ్ పెంటా సుజాత అన్నారు. మండలంలోని పెదరాయవరం గ్రామంలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

కోటిపల్లి కాలువకు గండి



కడియపులంక వద్ద ఇరిగేషన్ కాలువకు పడిన గండి నుంచి నర్సరీల్లోకి ప్రవహిస్తున్న నీరు

- నీట మునిగిన నర్సరీలు
- రూ.లక్షల్లో ఆస్తి నష్టం

కడియం: ధవళేశ్వరం నుంచి కోటిపల్లి వెళ్లే తూర్పుడెల్టా కాలువకు కడియం మండలం కడియపులంక వద్ద గండి పడింది. ప్రస్తుతం పంట కాలం కావడంతో కాలువల్లోకి నీటిని విడుదల చేశారు. పోటుగా కాలువ ప్రవహిస్తోంది. కడియపులంక వద్ద కాలువగట్టు తెగిపోయింది. ఈ గండి కారణంగా సమీపంలోని 15 ఎకరాలకు పైగా నర్సరీ మొక్కలు నీటమునిగాయి. వివిధ రకాల పండ్ల, అలంకరణ మొక్కలతోపాటు అరటి, దొండ తదితర కూరగాయల పంటలు కూడా నీటమునిగిపోయాయి. దీంతో దాదాపు 50 మంది రైతులకు సంబంధించి రూ.లక్షల్లోనే ఆస్తినష్టం జరిగిందని నర్సరీ రైతులు వాపోతున్నారు. బ్యాంకుల్లో రుణాలు తెచ్చి పెట్టుబడులు పెట్టి నర్సరీ మొక్కలను పెంచుతున్నామని, కాలువ గండితో పెట్టుబడులు నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ధవళేశ్వరం పర్యటనకు వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి కాలువకు గండిపడిన విషయాన్ని రైతులు తీసుకువచ్చారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. రక్షణ చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవతా నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ: మానవతా సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృత చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు సంస్థ నూతన అధ్యక్షుడు పాలకృష్ణ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా పాలకృష్ణ ప్రసాద్ రెడ్డి ఉపాధ్యక్షుడిగా రొంగల బాబూరావు, సెక్రటరీగా యూవీఎన్ సత్యనారాయణ(ఉప్పల శీను), జాయింట్ సెక్రటరీగా బొదిరెడ్ల అప్పారావు ప్రమాణస్వీకారం చేశారు. వీరితోపాటు కోశాధికారిగా దాసరి సాయిబాబా, ఈసీ సభ్యులుగా హెల్త్ విభాగం కన్వీనర్‌గా డాక్టర్ కొమ్మ శ్రీనివాస్, అవేర్స్ విభాగం కన్వీనర్‌గా జి.విజయకిరణ్, ఎడ్యుకేషన్ విభాగం కన్వీనర్‌గా యు.శ్రీరామ్‌మూర్తి ఎమర్జెన్సీ విభాగం కన్వీనర్‌గా తమ్మా రవిలతో పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ వి.చంద్రయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థ ద్వారా ఉచిత అంబులెన్స్‌సౌకర్యాలు, శాంతిరథం ఉచితంగా అందించడంతోపాటు విద్య, వైద్యం మొదలగు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. సంస్థ రీజినల్ చైర్మన్ సీహెచ్ ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బీఎస్ఎన్ మూర్తి, కో చైర్మన్ మద్దుల మురళీకృష్ణ, పూర్వపు అధ్యక్షులు బూర్లగడ్డ మురళి,ఎంవీ ధర్మారెడ్డి, న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, వ్యక్తిత్వ వికాశ నిపుణులు దారపు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిల సర్వే పరిశీలన



నగరంలో పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన కుళాయిలు ఉన్న ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, నారాయణపురంలో నిర్మించిన స్క్వాష్ కోర్టును ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆదివారం నగరంలో వివిధ పనులను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపయోగంలో ఉన్న కుళాయిల సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానికంగా ఆవలో సర్వే జరుగుతున్న ఇంటి వద్దకు వెళ్లి సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు చేస్తున్న సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఆవ వాంబే కాలనీ సమీపంలో వంద అడుగుల రోడ్డును ఆనుకొని నిర్మించ తలపెట్టిన సిటీ లెవెల్ పార్కు స్థలాన్ని పరిశీలించారు. పార్కు నిర్మాణం కోసం సమగ్రమైన ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక వి.ఎల్.పురంలో నిర్మించనున్న క్రికెట్ స్టేడియం పనుల సత్వరమే ప్రారంభించి, నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. గతంలోనే ఆమోదించిన ప్లాను ప్రకారం కట్టడాలు ప్రారంభించాలన్నారు. నగరంలోని క్రీడాకారులు ఏ నాటి నుంచో ఎదురు చూస్తున్న స్క్వాష్ కోర్టు నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని వాటికి వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని ఆదేశించారు.

పేకాట కేసులో ఏడుగురి అరెస్టు

సీతానగరం: ఇనుగంటివారిపేటలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీతానగరం ఎస్సై ఎ.ఫణిమోహన్ ఆదివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి ఇనుగంటివారిపేట శివారు ఏటిగట్టుపై పేకాట ఆడుతుండగా ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.3,600 స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఏడుగురు ఇనుగంటివారిపేటకు చెందిన వారేనని తెలిపారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

కొవ్వూరులో దాహం.. దాహం

- శివారు కాలనీలకు అందని తాగునీరు
- ట్యాంకర్లతో అరకొరగా సరఫరా
- పైపులైన్ల మరమ్మతుల్లో తగని నిర్లక్ష్యం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు
- మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక



కొవ్వూరు మెయిన్ రోడ్డులో పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి నుంచి పొంగి పొర్లుతున్న తాగునీరు



కొవ్వూరు రాజీవ్ కాలనీలో నీళ్లు రాని కుళాయి వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

కొవ్వూరు: జీవనది గోదావరి చెంతనే ప్రవహిస్తున్నా కొవ్వూరులో గొంతెండుతోంది. పట్టణంలోని అనేక శివారు ప్రాంతాలకు సక్రమంగా తాగునీరు అందడం లేదు. స్థానిక బ్రిడ్జిపేట, రాజీవ్, ఇందిరమ్మ, యానాద కాలనీల వాసులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు తాగునీరు సరఫరా కావడం లేదు. పట్టణంలో 12,982 కుటుంబాలు, 39,706 మంది జనాభా ఉన్నారు. ఒక్కో వ్యక్తికి రోజుకు 135 లీటర్ల తాగునీటిని అందించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 110 లీటర్ల చొప్పున మాత్రమే సరఫరా చేస్తున్నారు. పది బోర్లు, రెండు అండర్‌గ్రౌండ్ సంపులు, నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణవ్యాప్తంగా 40.92 కిలోమీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్లు విస్తరించి ఉన్నాయి. బ్రిడ్జిపేట, రాజీవ్, వాంబే కాలనీలకు మాత్రం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. రాజీవ్ కాలనీలో ఒక పూట నీళ్లు వస్తే రెండో రోజు రావడం లేదని వాపోతున్నారు. అర్ధరాత్రి రెండు గంటలకు ట్యాంకర్‌ను పంపిస్తున్నారని ఆ సమయంలో ఏవిధంగా నీళ్లు పట్టుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశంలోనూ పలుమార్లు సభ్యులు తాగునీటి సమస్యపై గళం విప్పినా ప్రయోజనం ఉండడం లేదు. పట్టణ శివారు జగనన్న కాలనీ వాసులకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని కౌన్సిల్ సభ్యులు సూచించినప్పటికీ పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. నెల రోజులుగా అనేక వార్డుల్లో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. కొన్నిచోట్ల కుళాయిల నుంచి తాగునీరు కలుషితంగా వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించుకుంటే మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. తాగునీటి కలుషితంపై కొవ్వూరు సబ్ కలెక్టర్ స్వయంగా పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌తో స్వయంగా ఫోన్‌లో మాట్లాడినా చర్యలు మాత్రం శూన్యం.

ఏఈ పర్యవేక్షిస్తున్నారు

పట్టణంలో తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసెఫ్‌ను వివరణ కోరగా పైప్ లైన్ మరమ్మతులను ఏఈలు పర్యవేక్షిస్తున్నారని బదులిచ్చారు. పూర్తి వివరాలు తనకు తెలియదన్నారు.ట్యాంకర్ల ద్వారా ఏయే ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారని ప్రశ్నించగా ఏఈలను అడిగి చెబుతానని సమాధానం చెప్పారు.

ముగ్గురు ఏఈలున్నా..

గతంలో ఎన్నడూ లేని విధంగా కొవ్వూరు మున్సిపాలిటీలో ముగ్గురు ఏఈలు పని చేస్తున్నారు. ఒక్కొక్కరు ఏడు లేదా ఎనిమిది వార్డుల చొప్పున బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఒకే ఏఈ పని చేసినపుడు కూడా ఈ స్థాయిలో తాగునీటి సమస్య లేదు. పట్టణంలో తాగునీటి సరఫరాను పూర్తిగా ఒక ఏఈ పర్యవేక్షిస్తున్నారు. పనులను మరో ఏఈ చూస్తునారు. అయినప్పటికీ తాగునీటి సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.పైప్‌లైన్ల మరమ్మతులు పూర్తి చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. మునిసిపల్ కమిషనర్ కనీసం క్షేత్ర స్థాయిలో పర్యటించక పోవడం విమర్శలకు తావిస్తోంది.

అస్తవ్యస్థంగా పైప్‌లైన్లు

పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ల వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైంది. మొత్తం 29 చోట్ల లీకేజీలు ఉన్నట్టు గుర్తించామని అధికారులు చెబుతున్నారు. వాటిలో కొన్నింటికి మరమ్మతులు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాలేదు. దాంతో అనేక ప్రాంతాల్లో నెల రోజులుగా తాగునీరు కలుషితంగా వస్తోంది. తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యం పేరుతో ఇటీవల «సాక్షి»లో కథనం రావడంతో మెయిన్‌రోడ్డులోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ వద్ద గల పైప్‌లైన్ గోతిని అధికారులు పూడ్చి వేయించారు. మళ్లీ అదే రోజు లీకేజీ ఏర్పడడంతో మళ్లీ గొయ్యి తవ్వించారు. ఈ గోతిలో తాగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. వేగివారి చావిడి ప్రాంతంలో రోడ్డుపై తవ్విన పైప్‌లైన్ గొయ్యిదీ ఇదే పరిస్థితి.

పది రోజులుగా అష్టకష్టాలు



తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా నెల క్రితం మా ప్రాంతంలో గొయ్యి తవ్వారు. ఇంత వరకూ మరమ్మతులు పూర్తి చేయలేదు. వారం, పది రోజులుగా మా ప్రాంతంలో తాగునీరు సరఫరా కావడం లేదు. సమీపంలోని ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నాం. చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పట్టించుకోవాలి.

–అనపర్తి జయలక్ష్మి, 20వ వార్డు, కొవ్వూరు

పట్టించుకున్న నాథులే లేరు



తాగునీటి కోసం నిత్యం అవస్థలు తప్పడం లేదు. పైప్‌లైన్ మరమ్మతుల పేరుతో తవ్వి వదిలేశారు. డ్రైనేజీ మురుగు నీరంతా మళ్లీ పైప్‌లైన్‌లోకి వెళుతోంది. కుళాయిల నుంచి రెండు బిందెల నీళ్లు రావడం కూడా గగనం అవుతోంది. తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులుగాని, అధికారులు పట్టించుకోవడం లేదు. పక్క వీధుల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం.

–రుత్తల పద్మ, గృహిణి, కొవ్వూరు

మునిసిపల్ ఆఫీసు ముట్టడిస్తాం



తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించకపోతే మునిసిపల్ ఆఫీసును ముట్టడిస్తాం. కాయకష్టం చేసుకుని బతికే జనం గుక్కెడు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బ్రిడ్జిపేట, రాజీవ్, వాంబే, యానాద, ఇందిరమ్మ కాలనీల్లో నీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. తాగునీరు కలుషితం అవుతున్నా అధికారు నిర్లక్ష్యం చేస్తున్నారు.

–పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు